
# మా ఆవిడ లావుగా ఉంది



ఆఫీసు నుండి అలసిపోయి ఇల్లుచేరిన నాకు ఇంటి వాతావరణం చూడగానే భయమేసింది. నా ఒక్కగానొక్క భార్య కోపగృహంలో కూర్చుని కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. మా ఆవిడిని అలాంటి స్థితిలో ఏనాడూ చూడని నేను ఏమైందో అర్థంకాక ఒక్కక్షణం నిలబడిపోయాను. భయపడుతూనే మా ఆవిడ దగ్గరకి నెమ్మదిగా చేరి ఎంతో ప్రేమగా 'ఏమైంది గజం' అంటూ అడిగాను. నా పలకరింపుతో గజలక్ష్మి మరింత గట్టిగా ఏడవసాగింది. గజం నోరంతా తెరిచి అలా ఏడుస్తుంటే నాకు సర్కస్‌లోని ఆడసింహం గుర్తొచ్చింది. గజాన్ని ఓదారుస్తూ 'అన్నీ సవ్యంగానే ఉన్నాయి గదా' అని అడిగాను.

గజం చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంటూ 'ఏమండీ ఇవాళ నాకెంత బాధగా వుందో మీకు తెలియదండీ' అంది.

'ఎందుకు, అసలేమైందో చెప్పు?'

ఇవాళ నేను షాపింగ్‌కి వెళ్ళాను. మార్కెట్‌లో వేయింగ్‌మెషీన్ కనిపించింది. నేను దానిపై నిలబడి ఒక రూపాయిబిళ్ళ లోపల వేశాను.....' చెబుతూ మధ్యలో ఆపేసింది. నేను ధైర్యంచెప్పాను. ఏం ఫరవాలేదు, తర్వాత ఏమైందో చెప్పు, నాణెం అందులో ఇరుక్కుపోయిందా లేక మెషీన్ పాడైందా?' 'రెండూ బాగానే ఉన్నాయి. మెషీన్‌లో నుండి ఒక టికెట్ బయటికి వచ్చింది. ఆ కార్డుపైన 'ఇక్కడ కేవలం మనుషులకు మాత్రమే బరువు తూయబడుతుంది. దయచేసి మెషీన్‌పై జంతువులు నిలబడరాదు' అని రాసి వుంది. అంటూ మళ్ళీ పెద్ద పెట్టున ఏడవసాగింది. గజలక్ష్మి చెప్పింది విని నవ్వొచ్చింది. నవ్వితే ఏం గొడవ జరుగుతుందోనని వస్తున్న నవ్వుని ఆపుకుంటూ గంభీరంగా ముఖంపెట్టి 'నువ్వు అంత బరువుగా లేవుగా' అన్నాను.

'నేను బాగా లావయ్యాను. ఇవాళ నేను రోడ్డుమీద నడుస్తుంటే ఇద్దరబ్బాయిలు 'రోడ్డురోలరు వస్తోంది తప్పుకోరా' అని అన్నారు. 'సరే గానీ,

**వై.కె.మూర్తి**

ముందు టీ పెట్టు. ఏం చేయాలో ఆ తర్వాత ఆలోచిద్దాం' అనగానే గజం టీ పెట్టడానికి వంటింట్లోకి వెళ్ళింది.

ఈ సమస్యను ఎలా పరిష్కరించాలా అని ఆలోచించాను పొద్దున్నే లేచి పరిగెత్తడం ప్రాక్టీసు చేయమందామా అంటే ఆమె పరిగెడుతుంటే వీధిలోని వాళ్ళందరూ మమ్మల్ని చూసి నవ్వుకుంటారు. 'సర్కస్ ఏనుగు ఎలా పరిగెడుతోందో చూడండి' అంటారు. నా భార్యను చూసి అందరూ నవ్వుకోవడం నాకిష్టం లేదు. నా ఆలోచనలు అలా సాగుతున్నాయి.

ఇంతలో మా ఆవిడ టీతో పాటు పేపర్ కూడా తెచ్చిచ్చింది. నెమ్మదిగా టీ తాగుతూ పేపరు చూస్తుంటే అందులో ఒక ప్రకటన కనిపించింది. ఆ ప్రకటన చదవగానే చాలా సంతోషం వేసింది. ఆ ప్రకటనలో ఒక ఫోటో వుంది. మొదటి ఫోటోలో ఒక మెషీన్‌లోకి లావుగా ఉన్న ఒకడావిడని పంపిస్తున్నారు. మరో ఫోటోలో ఆవిడ సన్నగా అయి మెషీన్‌లో నుండి బయటికి వస్తోంది.

నా భార్య అలా సన్నగా అవడం ఊహించుకుంటేనే నా శరీరం ఆనందంతో పులకరించిపోయింది. టీ కప్పు పక్కన పెట్టి గజలక్ష్మికి ఆ ప్రకటన చూపించాను. ప్రకటన చూడడంతోనే గజం కళ్ళు మెరిసాయి. ఆ మెరుపు వాళ్ళ పుట్టింటినుండి ఎవరైనా వచ్చినపుడు ఆమె కళ్ళలో కనిపించే మెరుపులా వుంది.

ఆ మర్నాటి సాయంత్రం నా భార్యను ఆ ప్రకటనలో ఇచ్చిన అడ్రస్‌కి తీసుకెళ్ళాను. అక్కడ నా భార్యకన్నా లావుగా 'సుమో పహిల్వాన్ సోదరుల' అనుంగు సోదరీమణులు చాలా మందే కనిపించారు. ఇంతలో అక్కడ గోపి కనిపించాడు. గోపి ఇంతక్రితం మా ఊళ్ళో పొలం పని చేసేవాడు. అప్పట్లో ఒక విడోని ఊరినుండి లేపుకుపోయాడు. మమ్మల్ని చూడగానే వాడు గుర్తుపట్టి మా దగ్గరికి వచ్చాడు. మాకు నమస్కరించి ఇక్కడికి ఎందుకు వచ్చారని అడిగాడు. నేను విషయం చెప్పాను. అతను వెంటనే మా పేరును మొదటి నెంబరుస్థానంలో రాశాడు. మొదటగా చూపించుకునేవాళ్ళకి కొన్ని మినహాయింపులు కూడా వున్నాయి.

గోపి మాకు అక్కడి వివరాలన్నీ చెప్పాడు. చికిత్సకు కొన్నివేల రూపాయలు అవుతాయి. 'డబ్బు పోయినా మీ భార్యగారు హీరోయిన్‌లా తయారవుతారు. ఈ ప్రెషర్ మెషీన్‌లో ఆవిరి శరీరంలోని కొవ్వుని వదలగొడుతుంది. దానితో ఆవిడ స్లిమ్ అండ్ ట్రిమ్‌గా అవుతారు' అని చెప్పాడు. గోపి చెప్పినమాటలు విని మా ఆవిడ బోలెడు సంబరపడిపోయింది.

మా ఆవిడని ఒకగదిలోకి తీసుకెళ్ళారు. గోపి నన్ను బయట కూర్చోబెట్టాడు. గది బయట ఒక ఎర్రబల్బు వెలుగుతోంది. గదిలోపల నుండి ఒక విచిత్రమైన శబ్దం వస్తోంది. ఖాళీ డబ్బాలోకి బస్తాలోని గోధుమలు ఎత్తి పోస్తున్నట్లుగా వుంది ఆ శబ్దం. మా ఆవిడ అప్సరసలాగా తయారైనట్లు, రంభలాగా వున్న మా ఆవిడ కోసం ఆకతాయి అబ్బాయిలు అందరూ వీధిలో కాపు వేసినట్లు నేను ఊహాలోకంలోకి వెళ్ళిపోయాను.

'గజలక్ష్మి లావుగా ఉంటే ఉంది గానీ పొద్దున్నే లేచి నా కోసం వేడినీళ్ళు పెడుతుంది. టిఫిన్, లంచ్‌బాక్స్ తయారుచేసి చేతికిచ్చి నవ్వుతూ టాటా చెప్తుంది. ఆఫీసునుండి ఇంటికొచ్చిన దగ్గర్నుంచి నాకేం కావాలో అవన్నీ చేస్తుంటుంది. మా ఇద్దరి జంట స్కూటర్, ట్రాక్టర్‌లా ఉండవచ్చుగానీ, నిజానికి నా భార్య చాలా మంచిది' ఇలా సాగుతున్నాయి నా ఆలోచనలు.

కొద్దిసేపటికి గోపి కంగారుపడుతూ వచ్చాడు. "అయ్యా, మీ ఫీజు మీరు తిరిగి తీసుకోండి. మా మెషీన్ అంత బరువు మోయలేకపోతోంది. ఇప్పటికి నాలుగుసార్లు ఫ్యూజు పోయింది' అని చెప్పాడు.

'అయితే ఇప్పుడునన్నేం చేయమంటావ్?' నేను నిరాశగా అడిగాను.

'దయచేసి నా మాట విని మీ ఆవిడని తీసుకెళ్ళిపోండి, ఈ మెషీన్ కేవలం మనుషుల కోసమే....' అని మాటలు సగంలో ఆపేశాడు.


కొంచెం సేపటికి మా ఆవిడ బయటికి వచ్చింది. తనని చూడగానే నాకు దుఃఖం ముంచుకొచ్చింది. గోపి ఒక వేయి రూపాయిలు నాచేతిలో పెట్టి 'అయ్యా నేను మీ ఊరివాడినే కదా, నాకొక ఉపకారం చేసిపెట్టండి' అన్నాడు.

'చెప్పు' అన్నాను.

'అయ్యా, అమ్మగారికి కోపం రాకుండా ఉండడం కోసం వేయి రూపాయలిచ్చాను. మీరు నేను తీసుకొచ్చిన ఈ యువతిని తీసుకుని ప్రధాన ద్వారం గుండా బయటికి వెళ్ళండి. అక్కడ హాల్లో కూర్చున్న మహిళలు 'అమ్మగారు ఒక గంటలో ఇంత సన్నగా అయ్యారనుకుని సంతోషిస్తారు. అమ్మగారు వెనుక గేటు దగ్గర మీ కోసం ఎదురు చూస్తుంటారు...' అన్నాడు.

వెంటనే నేను ఆ డబ్బుని గోపికి తిరిగి ఇచ్చేసాను.

'నా గురించి నువ్వు ఏమనుకుంటున్నావు? నేను ఎవరు పడితే వాళ్ళ వెంటపడి తిరిగేవాడిలా కనిపిస్తున్నానా? నల్లగా వున్నా, లావుగా వున్నా నా భార్య నా భార్యే. నా భార్యకు సాటి ఎవరూ లేరు. నువ్వు కోటి రూపాయలిచ్చినా నేను చస్తే ఆ అమ్మాయి వెంట వెళ్ళను అని గోపితో అరిచినట్లుగా చెప్పాను, వెంటనే మా ఆవిడ చేయి పుచ్చుకుని వెనుక గేటు నుండి బయటపడ్డాను !




ప్రకాశంజిల్లా ఇంకొల్లులో ప్రముఖకవి డాక్టర్ బీరం సుందరరావు కవితా సంపుటి "భూమి తడవని వర్షం"ను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి దగ్గుబాటి పురంధీశ్వరి. చిత్రంలో పర్చూరు ఎమ్.ఎల్.ఏ డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, జర్నలిస్టు కంచర్ల రామయ్య, కవి బీరం సుందరరావు ఉన్నారు.